# వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి



రాజీవ్ ఆరోగ్యశ్రీ చేయూత పథకాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు
- రాజీవ్ ఆరోగ్యశ్రీ చేయూత పథకం ప్రారంభం

అలంపూర్, డిసెంబర్ 10 : నిరుపేద కుటుంబాలు కార్పొరేట్ దవాఖానల్లో నాణ్యమైన వైద్యసేవలు పొందేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంను ప్రవేశ పెట్టిందని, ఈ పథకంను పేద కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు సూచించారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ దవాఖానలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజీవ్ ఆరోగ్యశ్రీ చేయూత పథకంను లాంఛనంగా ప్రారంభించారు. ప్రతి పేద కుటుంబానికి రూ.10 లక్షల వరకు సూపర్ స్పెషాలిటీ దవాఖానల్లో వైద్య సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమా వెంకటేశ్, జిల్లా వైద్యాధికారి శశికళ, డీసీఈవో ముసాయిదా బేగం, సీఈసీ డాక్టర్ సయ్యద్ బాషా, ప్రోగ్రాం అధికారి రాజు, మానవపాడు ఎంపీపీ అశోక్, జోగుళాంబ ఆలయ చైర్మన్ చిన్ని కృష్ణయ్య, వైస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రీ బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే

మహాలక్ష్మి పథకంలో భాగంగా వయసుతో సంబంధం లేకుండా మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు అవకాశం కల్పించిందని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో ఉచిత ఆర్టీసీ బస్సు సర్వీసును ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ప్రయాణికులకు జీరో టికెట్లను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మనోరమావెంకటేశ్‌తోపాటు డీఎం మంజుల తదితరులు పాల్గొన్నారు.

## క్యాంప్ కార్యాలయం పరిశీలన

ఉండవెల్లి, డిసెంబర్ 10 : అలంపూర్ చౌరస్తాలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ఆదివారం ఎమ్మెల్యే విజయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సమావేశపు హాలు, ఎమ్మెల్యే క్యాబిన్, వీఐపీల హాల్‌ను పరిశీలించి అన్ని ఏర్పాట్లు చేయాలని, అలాగే పెయింటింగ్ వేయడంతోపాటు ప్రహరీకి మరమ్మతులు చేయించి ఖాళీ ప్రదేశంలో మొక్కలు నాటాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం త్వరలో క్యాంప్ కార్యాలయం నుంచి పాలన కొనసాగించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.



మహిళలకు ఉచిత బస్ ప్రయాణానికి టికెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు



గద్వాల ఎమ్మెల్యేగా రెండో సారి విజయం సాధించగా ఆదివారం అలంపూర్‌లోని జోగుళాంబ దేవిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి - అలంపూర్, డిసెంబర్ 10

# రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీలో మహబూబ్‌నగర్ బాలుర జట్టు జయకేతనం

- రన్నర్‌గా నిలిచిన హైదరాబాద్ జట్టు
- బాలికల విభాగంలో రంగారెడ్డి జిల్లా జట్టు విజయం
- రన్నర్స్‌గా నిలిచిన నిజామాబాద్ జట్టు

జడ్చర్లటౌన్, డిసెంబర్ 10 : స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జడ్చర్లలోని బాదేపల్లి జెడ్పీహెచ్‌ఎస్ మైదానంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-17 బాలబాలికల ఫుట్‌బాల్ టోర్నీలో మహబూబ్‌నగర్ బాలుర జట్టు విజయం సాధించింది. ఆదివారం ఉదయం జరిగిన సెమీఫైనల్ మ్యాచుల్లో బాలుర విభాగంలో మహబూబ్‌నగర్, హైదరాబాద్ జట్లు, బాలికల విభాగంలో రంగారెడ్డి, నిజామాబాద్ జట్లు ఫైనల్‌కు చేరాయి. హోరాహోరీగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌ల్లో బాలుర విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు విజయం సాధించగా హైదరాబాద్ జట్టు రన్నర్‌గా నిలిచింది. బాలికల విభాగంలో రంగారెడ్డి జిల్లా జట్టు విజయం సాధించగా నిజామాబాద్ జట్టు రన్నర్‌గా నిలిచింది. 8వ తేదీ నుంచి ప్రారంభమైన రాష్ట్రస్థాయి బాలబాలికల ఫుట్‌బాల్ టోర్నీలో మొత్తం 10 ఉమ్మడి జిల్లాలకు చెందిన బాలుర, బాలికల జట్లు తలపడ్డాయి. ఈ సందర్భంగా విజయం సాధించిన జట్లకు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి రమేశ్‌బాబు, టోర్నమెంట్ ఆర్గనైజర్స్ జీహెచ్‌ఎం చంద్రకళ, విలియం, మొయిన్, కృష్ణయ్య, బాలరాజయ్య, ఆనంద్, కుమార్, శారదాబాయి, ఉమాదేవి, జ్యోతి, రాములు, రాజవర్ధన్‌రెడ్డి, వెంకటమ్మ, టోర్నమెంట్ పరిశీలకులు ప్రేమ్‌కుమార్, భావన, అంపైర్లు వడెన్న, భానుకిరణ్, రాము, నరేశ్, శ్రీకాంత్, నిఖేశ్ తదితరులు పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్ జిల్లా బాలుర జట్టుకు కప్ అందజేస్తున్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌డ్డి



షూటింగ్‌బాల్ టోర్నీలో మూడో స్థానంలో నిలిచిన పాలమూరు జట్టు

## షూటింగ్‌బాల్ టోర్నీలో మూడో స్థానంలో మహబూబ్‌నగర్

మహబూబ్‌నగర్‌టౌన్, డిసెంబర్ 10 : నల్గొండ జిల్లాలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ బాలుర జట్టు మూడో స్థానంలో నిలిచింది. జట్టులో మైనార్టీ గురుకుల విద్యార్థులు ప్రతిభ చాటారు. జట్టు క్రీడాకారులను ఆర్‌ఎల్‌సీ ఖాజాబహుద్దీన్, జమీర్‌అహ్మద్‌ఖాన్, మహమూద్‌అలంఖాన్, సలీం, మహ్మద్‌జహీర్, ప్రిన్సిపాల్ సమీ, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

## జూరాలకు స్వల్ప వరద

ధరూరు, డిసెంబర్ 10 : జూరాల ప్రాజెక్ట్‌కు స్వల్ప వరద కొనసాగుతున్నది. ఎగువ నుంచి 1,904 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 1,233 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. నెట్టెంపాడు లిఫ్ట్‌కు 375 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 390 క్యూసెక్కులు, కుడి కాల్వకు 401 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్‌లో 8.087 టీఎంసీలకుగానూ 4.380 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.

## ఆర్డీఎస్ ఆనకట్టకు స్వల్పంగా..

అయిజ, డిసెంబర్ 10 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద స్వల్పంగా కొనసాగుతున్నది. టీబీ డ్యాం నుంచి విడుదల చేసిన నీరు ఆనకట్టకు చేరుకుంటున్నది. ఆదివారం ఆనకట్టకు ఇన్‌ఫ్లో 220 క్యూసెక్కులు చేరుతుండగా, ఆర్డీఎస్ ప్రధాన కాల్వకు 395 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 7.8 అడుగుల మేర నీటిమట్టం ఉన్నట్లు ఏఈ రాందాస్ తెలిపారు.

# మార్మోగిన గోవింద నామస్మరణ

- కొనసాగుతున్న కురుమూర్తిస్వామి జాతర
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు



భక్తులతో కిటకిటలాడుతున్న జాతర ప్రాంగణం

దేవరకద్ర రూరల్(చిన్నచింతకుంట), డిసెంబర్ 10 : చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ గ్రామ సమీపంలో వెలిసిన కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు ముగిసినప్పటికీ జాతర కొనసాగుతున్నది. కార్తీకమాసం అలాగే సెలవు దినం కావడంతో ఆదివారం భక్తులు వేల సంఖ్యలో కురుమూర్తి కొండకు తరలిరావడంతో గోవింద నామస్మరణతో కాంచనగుహ మార్మోగింది. భక్తులు ముందుగా భక్తి శ్రద్ధలతో పుష్కరిణీలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారికి నైవేద్యాలు సమర్పించారు. అలాగే కొందరు భక్తులు మెట్టుమెట్టుకు కొబ్బరికాయలు కొడుతూ మొక్కులు చెల్లించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. అనంతరం మహిళలు గాజుల దుకాణాలు, స్వీట్లు దుకాణాల్లో కొనుగోలు చేయడంలో బిజిబిజీగా ఉండగా చిన్నారులు రంగుల రాట్నాలు, జాయింట్ వీల్ తదితర వాటిని ఎక్కుతూ ఆటవస్తువులు కొనుగోలు చేస్తూ సందడి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో జాతర ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది.



స్వామి దర్శనం కోసం బారులుదీరిన భక్తులు



కొండపైకి వెళ్లే మెట్లకు పూజలు చేస్తున్న భక్తులు

# ఉమ్మడి జిల్లాలో తొలిరోజు 76వేల మంది మహిళల ప్రయాణం

మహబూబ్‌నగర్‌టౌన్, డిసెంబర్10 : కొత్తగా కొలువు దీరిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా బస్సుల్లో మహిళా ప్రయాణికులకు ఉచిత ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి తెచ్చింది.కర్ణాటక తరహాలో తెలంగాణలోనూ ఇక నుంచి ప్రయాణించవచ్చు. వయస్సుతో సంబంధం లేకుండా మహిళలు, థర్డ్ జెండర్లకు సైతం ఈ పథకం వర్తిస్తుంది. ప్రయాణ సమయంలో కేవలం ఆధార్ కార్డు ఉంటే ప్రయాణించే మహిళలు జీరో టిక్కెట్‌తో ప్రయాణం చేశారు. శనివారం ఒకే రోజు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 75,940 మంది మహిళలు ప్రయాణం చేసినట్లు ఆర్‌ఎం శ్రీదేవి తెలిపారు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు కిక్కిరిసిపోయాయి. షాద్‌నగర్ డిపో నుంచి12,490, మహబూబ్‌నగర్ 11,050, వనపర్తి 8,770, నాగర్‌కర్నూల్ 7,990, నారాయణపేట7,890, గద్వాల 7,845, కల్వకుర్తి 6,951, అచ్చంపేట 6,164, కొల్లాపూర్ 6,010, కోస్గి 780 మంది మహిళా ప్రయాణికులు ప్రయాణించారు. ఆర్టీసీ సూమరు రూ.50లక్షల ఆదాయం కోల్పోయింది.



మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో మహిళల సందడి